


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం — తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA — RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 13.04.2026 | సంపుటి: 3 | సంచిక: 72 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 13.04.2026 | VOLUME : 3 | ISSUE : 72 | PAGES: 8 | COST: 2/- |


## మహిళా రిజర్వేషన్ బిల్లుకు
# మద్దతు ఇవ్వండి

- మహిళా రిజర్వేషన్ అమలుకు సమయం ఆసన్నమైందని వ్యాఖ్య
- 2029 ఎన్నికలను 33% రిజర్వేషన్‌తో నిర్వహించాలని సూచన
- పార్టీలకు అతీతంగా చట్టానికి మద్దతు ఇవ్వాలని పిలుపు
- ఎంపీలకు ప్రధాని మోదీ లేఖ
- ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో బిల్లుపై చర్చ ప్రారంభం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:
మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియమ్) అమలుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా మహిళలకు రాజకీయాల్లో సముచిత అవకాశాలు కల్పించే సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2వ పేజీలో..

### మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఖర్గే ప్రశ్నలు



- ప్రత్యేక సమావేశంపై కాంగ్రెస్ అభ్యంతరం
- డీలిమిటేషన్ వివరాలు వెల్లడించాలని డిమాండ్
- ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం కోరిన ప్రతిపక్షాలు
- రాజకీయ లబ్ధికోసమే కేంద్రం చర్యలంటూ విమర్శ

2

### తుక్డే తుక్డే గ్యాంగ్‌ను పార్లమెంటుకు పంపుతున్న టీఎంసీ: మోదీ విమర్శలు

- టీఎంసీ పాలనలో అవినీతి, హింస పెరిగిందని ఆరోపణ
- మే 4 తర్వాత బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా
- సిలిగురి కారిడార్‌పై వ్యాఖ్యలు దేశ భద్రతకు ముప్పని విమర్శ

2



## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల..
# అమ్మాయిలదే పైచేయి

- ఫస్టియర్‌లో 66.20%, సెకండియర్‌లో 70.58% ఉత్తీర్ణత
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరు
- వెబ్‌సైట్లు, WhatsApp ద్వారా ఫలితాలు చూసే సౌకర్యం

హైదరాబాద్, ఏప్రిల్ 12: తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల య్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల సలహాదారు కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా

మిగతా 2వ పేజీలో..

## భేషజాలు లేకుండా అన్ని ప్రాంతాలను
# అభివృద్ధి చేస్తున్నాం

- సిద్దిపేటలో హరీశ్ రావు ఉన్నా పరిశ్రమలు స్థాపిస్తున్నాం
- స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలి
- డిసెంబర్ లోపు ప్రాజెక్ట్ పూర్తి కావాలి
- రాష్ట్ర పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

3





### చైనా తప్పుదారి పట్టించే ప్రయత్నాలు..

- పేర్లు మార్చినా వాస్తవాలు మారవు
- అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం
- తప్పుడు ప్రయత్నాలు వాస్తవాలను మార్చలేవని వ్యాఖ్య
- ఎంఈఏ ప్రతినిధి రణధీర్ జైస్వాల్

2



# రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో దాచుకో' పాలన

- సీఎం నుంచి మంత్రుల వరకు అవినీతి
- కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయి
- సింగరేణిలో వేల కోట్ల దోపిడీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు2లో

### బీఆర్ఎస్‌గా మారాక నష్టపోయాం

- మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన చేస్తున్నాం
- రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రకు సిద్ధం
- వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేదు
- కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం తీసుకురావడమే లక్ష్యం:
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



2

### కాళేశ్వరం పునరుద్ధరణ పనులు వేగవంతం



## అమీన్పూర్‌లో ఆక్రమణల
# తొలగింపు వేగం

861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ దాదాపు పూర్తి

3

## పాలమూరు వలస జిల్లాగా మారటానికి
# కాంగ్రెస్ కారణం



- పాలమూరు–రంగారెడ్డి పథకం పనులు 80% పూర్తి చేశాం
- మిగిలిన పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ విఫలం
- ప్రాజెక్టులు కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే చేపడుతున్నారు
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

2

# ఏటీఎంలలో రూ.1.20 కోట్ల మాయం..

- కస్టోడియన్లు పరార్
- 31 ఏటీఎంల తనిఖీల్లో 8 కేంద్రాల్లో నగదు తక్కువగా గుర్తింపు
- రూ.1,20,98,500 లోటు బయటపడినట్టు సంస్థ గుర్తింపు



3

### గ్యాస్ సిలిండర్లు పేలి నలుగురికి గాయాలు



2

## పెళ్లి పేరుతో
# భారీ మోసం..

- నకిలీ ఉద్యోగంతో యువతిని మోసగించిన వ్యక్తి అరెస్ట్
- ఫేక్ ఐడీతో టెక్నికల్ మేనేజర్‌గా నటించిన నిందితుడు
- రూ.1.5 కోట్ల వరకట్నం ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం
- ఫ్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో యువతిని వేధించిన ఆరోపణ

2



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹66

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి

**మొదటిపేజీ తరువాయి**

విస్తృత సంప్రదింపుల అనంతరం మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహించాల్సిన అవసరం ఉందని లేఖలో సూచించారు. మహిళలు, భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలా కాలంగా ప్రజా ప్రతినిధులు కోరుతున్నారని, వారి ఆకాంక్షలను కార్యరూపంలోకి తీసుకువచ్చే సమయం ఇదేనని పేర్కొన్నారు. ఈ చట్టసవరణ బిల్లును ఆమోదించే విషయంలో అన్ని పార్టీలు ఒకే తాటిపైకి రావాలని కోరారు. పార్లమెంటులో సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకోవడం దేశానికి గర్వకారణమవుతుందని తెలిపారు.

మహిళలకు నాయకత్వ అవకాశాలు పెరిగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ లక్ష్యాలను సాధించాలంటే మహిళలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభం కానున్నట్లు లేఖలో పేర్కొన్నారు.




## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల.. అమ్మాయిలదే పైచేయి

**మొదటిపేజీ తరువాయి**

రాణా ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలు పైచేయి సాధించారు. ప్రకటించిన ఫలితాల ప్రకారం ఇంటర్ ఫస్టియర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 70.58 శాతం మంది పాస్ అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు 20 కేంద్రాల్లో సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి తక్కువ సమయంలోనే ఫలితాలను సిద్ధం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లు tgbie.cgg.gov.in, results.cgg.gov.in ద్వారా హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి తెలుసుకోవచ్చు. అదనంగా WhatsApp ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. 8096958096 నంబర్‌కు WhatsApp లో 'Hi' అని మెసేజ్ పంపి సూచనలను అనుసరిస్తే ఫలితాలు పొందవచ్చు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షల పూర్తి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు వివరించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో–దాచుకో' పాలన

- **సీఎం నుంచి మంత్రుల వరకు అవినీతి**
- **కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయి**
- **సింగరేణిలో వేల కోట్ల దోపిడీ**
- **కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**మంచిర్యాల, ఏప్రిల్ 12:**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకో-దాచుకో' అనే విధానాన్ని అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన పార్టీ కౌన్సిలర్ల అభినందన సభలో పాల్గొని మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా నిలిచారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని విమర్శించారు. సింగరేణిలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని, సీబీఐ విచారణ కోరినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సింగరేణిలో సీఎం బావమరిది సృజన్ రెడ్డి 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' పేరుతో కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రతి బొగ్గు గనిపైనా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి భయాందోళన వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## గ్యాస్ సిలిండర్లు పేలి నలుగురికి గాయాలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 12**



సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ లో మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో కల్వకుంట రోడ్డు లోని ఇంటి నెంబర్ 518/1 ఒక నివాస గృహంలో ప్రమాదవశాత్తు ఎల్పిజి గ్యాస్ సిలిండర్ లికై అగ్నిప్రమాదం సంభవించింది. సిలిండర్లను డెలివరీ చేసే వ్యక్తి ఇంట్లో సిలిండర్లు పేలి ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సంగమేశ్, మల్లమ్మ, శ్రీజ, ఆమోసులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. భారీ శబ్దంతో జరిగిన ఈ పేలుడు దాటికి ఇల్లు ధ్వంసం అయింది. స్థానికులు వయాగ్రాంతులకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి, ఇంట్లో గ్యాస్ సిలిండర్లు ఎందుకు ఉన్నాయని దానిపై అనుమానంతో దర్యాప్తు చేస్తున్నారు.

## తుక్డే తుక్డే గ్యాంగ్‌ను పార్లమెంటుకు పంపుతున్న టీఎంసీ: మోదీ విమర్శలు

- **టీఎంసీ పాలనలో అవినీతి, హింస పెరిగిందని ఆరోపణ**
- **మే 4 తర్వాత బీజేపీ ప్రభుత్వం వస్తుందని ధీమా**

**సిలిగురి:**

బెంగాల్‌లో 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న టీఎంసీ అవినీతి, హింస, బెదిరింపు రాజకీయాలతో పాలన సాగించిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. రాజకీయ హింస, ప్రతిపక్ష కార్యకర్తలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల భయోత్పాత వాతావరణం ఏర్పడిందన్నారు. కొన్ని సందర్భాల్లో హత్యలు చోటుచేసుకున్నాయని, ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కావని తెలిపారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల్లో మార్పు అవసరమని పిలుపునిచ్చారు.

**మే 4 తర్వాత మాదే ప్రభుత్వం**

మే 4 తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గత 15 ఏళ్లలో జరిగిన ప్రతి చర్యకు టీఎంసీ సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. బెదిరింపులు, రాజకీయ హింస టీఎంసీ విధానంగా మారిందని విమర్శించారు. బెంగాల్ ప్రజలు ఇక ఇవి సహించరని పేర్కొన్నారు.

**తుక్డే తుక్డే గ్యాంగ్ ఆరోపణలు**

టీఎంసీ విభజన ఎజెండాలు జాతీయ ఐక్యతకు ముప్పుగా మారుతున్నాయని మోదీ అన్నారు. సిలిగురి కారిడార్‌ను విడదీస్తామని తుక్డే తుక్డే గ్యాంగ్ బెదిరింపులు చేస్తోందని, అలాంటి వారిని పార్లమెంటుకు టీఎంసీ పంపుతోందని ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాలకు కీలక మార్గమైన సిలిగురి కారిడార్ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు.

**మహిళల రక్షణపై హామీ**

బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని మోదీ హామీ ఇచ్చారు. మహిళల రక్షణకు ప్రత్యేక పోలీస్ సపోర్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజకీయ హింసపై విచారణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, నేర మాఫియా కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఖర్గే ప్రశ్నలు

- **ప్రత్యేక సమావేశంపై కాంగ్రెస్ అభ్యంతరం**
- **డీలిమిటేషన్ వివరాలు వెల్లడించాలని డిమాండ్**
- **ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం కోరిన ప్రతిపక్షాలు**
- **రాజకీయ లబ్ధికోసమే కేంద్రం చర్యలంటూ విమర్శ**

**న్యూఢిల్లీ:**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును త్వరితగతిన అమలు చేయాలని కేంద్రం ప్రయత్నించడం ప్రశ్నార్థకమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఇది రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యలా కనిపిస్తోందని పేర్కొంటూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారం కోరడం సరికాదని ఖర్గే అన్నారు. ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశాలపై అర్థవంతమైన చర్చ అవసరమని తెలిపారు. ఇందుకోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయాన్ని గుర్తుచేసిన ఖర్గే, ఆ సమయంలో తక్షణ అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున కోరిన విషయాన్ని తెలిపారు. అయితే డీలిమిటేషన్, ఇతర కీలక అంశాలపై స్పష్టత లేకుండా ఈ చట్టంపై సమగ్ర చర్చ సాధ్యం కాదని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపామని ప్రధాని చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని ఖర్గే విమర్శించారు.

2026 ఏప్రిల్ 29న ఎన్నికలు ముగిసిన తర్వాత రాజ్యాంగ సవరణలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తే, డీలిమిటేషన్ అంశంపై ఎన్నికల అనంతరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని లేఖలో సూచించారు.

## పాలమూరు వలస జిల్లాగా మారటానికి కాంగ్రెస్ కారణం

- **పాలమూరు–రంగారెడ్డి పథకం పనులు 80% పూర్తి చేశాం**
- **మిగిలిన పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ విఫలం**
- **రైతుబంధు, రుణమాఫీ హామీలు అమలు కాలేదు**
- **ప్రాజెక్టులు కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే చేపడుతున్నారు**
- **సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు**

**వనపర్తి, ఏప్రిల్ 12:**



పాలమూరు జిల్లా వలస జిల్లాగా మారటానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.30 వేల కోట్లు ఖర్చు చేసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను 80 శాతం పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగి ఉంటే పాలమూరు జిల్లా ఇప్పటికే పూర్తిస్థాయిలో సస్యశ్యామలం అయ్యేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు, కమీషన్ల కోసమే ప్రాజెక్టులు చేపడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, అవసరం లేని గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణం ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. జూరాల వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని తాను కోరుతున్నట్లు తెలిపారు. తమ పాలనలో ఈ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికే మూడు రైతుబంధు విడతలు బకాయిగా ఉన్నాయని, ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగిందా అని ప్రశ్నించారు. నాలుగు విడతల రైతుబంధు అందిందని రైతులు చెబితే తన పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే సీఎం రాజీనామాకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మొక్కజొన్నలు కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రభుత్వంతో పోరాటం చేసి గొల్లపల్లి, చీర్కపల్లి గ్రామాలకు న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కేసులకు కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు.

## కాళేశ్వరం పునరుద్ధరణ పనులు వేగవంతం

- **మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు ప్రాధాన్యం**
- **2027–28 నాటికి పనులు పూర్తి చేస్తామని ప్రకటన**
- **AFRY ఇండియా, IIT ముంబైకి డిజైన్ బాధ్యతలు**
- **వారానికి రెండుసార్లు సమీక్షలు నిర్వహించాలని ఆదేశం**

**హైదరాబాద్:**



కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో కాళేశ్వరం బ్యారేజీలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

బ్యారేజీల్లో తీవ్రమైన లోపాలను ఎన్డీఎస్ఏ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. 2027 నుంచి 2028 నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. AFRY ఇండియా, IIT ముంబైకు డిజైన్ బాధ్యతలు అప్పగించనున్నట్లు వెల్లడించారు. CWPRS పరీక్షలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, 45 రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పనుల పర్యవేక్షణకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వారానికి రెండుసార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎల్ అండ్ టీ సహ సంస్థల క్యాంపులను మళ్లీ ప్రారంభించాలని, అన్ని పరీక్షలను సంయుక్తంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## రూటు మార్చిన మత్తు ముఠాలు

- **యాప్‌ల ద్వారా డ్రగ్స్ దందా - సెషన్, సిగ్నల్‌లో నగదు లావాదేవీలు**

డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ముఠాలు కొత్త కొత్త మార్గాలు ఎంచుకుంటున్నాయి. ఫేస్‌బుక్, వాట్సాప్‌లో లావాదేవీలతో పట్టుబడటంతో రూటుమార్చారు. సిగ్నల్, సెషన్ యాప్‌ల ద్వారా లావాదేవీలు కొనసాగిస్తున్నారు. అక్కడ జరిగే చీకటి కార్యకలాపాలు గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

మొబైల్స్ పరిశీలించినపుడు గుట్టురట్టు : గతంలో నైజీరియన్లు, స్థానిక ఏజెంట్లు, డెడ్‌డ్రాప్ పద్ధతిలో సరకు కొనుగోలుదారులకు డ్రగ్స్ అందించేవారు. పోలీసు నిఘా పెరగడంతో ఇప్పుడు యాప్‌లను వేదికగా మలచుకున్నారు. సింథటిక్ డ్రగ్స్, గంజాయిలో 90 శాతం యాప్‌ల్లోనే హైదరాబాద్ నగరానికి చేరుతున్నట్టు గుర్తించారు. ఇతర దేశాల్లోని కొందరు నైజీరియన్లు డ్రగ్స్ స్మగ్లింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లను ఉపయోగిస్తున్నట్టు అంచనాకు వచ్చారు. తాజాగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, మాదాపూర్, కొంపల్లి ప్రాంతాల్లో పట్టుబడిన మత్తుబాబుల మొబైల్స్ పరిశీలించినపుడు లోగుట్టు వెలుగులోకి వచ్చింది. ఎంత డబ్బులు పెట్టైనా కొనేందుకు సిద్ధం : వారాంతం వచ్చిందంటే చాలు రిసార్ట్స్, పబ్‌లు, ఫామ్‌హౌస్‌లు పార్టీలతో కళకళలాడుతుంటాయి.

## పెళ్లి పేరుతో భారీ మోసం..

- **నకిలీ ఉద్యోగంతో యువతిని మోసగించిన వ్యక్తి అరెస్ట్**
- **ఫేక్ ఐడీతో టెక్నికల్ మేనేజర్‌గా నటించిన నిందితుడు**
- **రూ.1.5 కోట్ల వరకట్నం ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం**
- **ప్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో యువతిని వేధించిన ఆరోపణ**
- **నకిలీ ఐడీలు, మొబైల్, కారును స్వాధీనం చేసిన పోలీసులు**


**హైదరాబాద్:**

హైదరాబాద్‌లో పెళ్లి పేరుతో జరిగిన భారీ మోసం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్తపేట్ అల్కాపురి కాలనీకి చెందిన పనస మధు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో గ్రేడ్-3 టెక్నికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని నకిలీ ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. ఈ నకిలీ గుర్తింపుతో బాధితురాలి కుటుంబాన్ని నమ్మించి పెళ్లి సంబంధం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

పెళ్లి పేరుతో మొదట రూ.2 కోట్ల వరకట్నం డిమాండ్ చేసిన నిందితుడు, తర్వాత రూ.1.5 కోట్లకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నల్గొండ జిల్లాకు చెందిన యువతితో నిశ్చితార్థం కూడా చేసుకున్నట్లు వెల్లడించారు. తర్వాత ప్రీ వెడ్డింగ్ షూట్ పేరుతో బాధితురాలిని తన గదికి పిలిపించి, అనుమానాలు వ్యక్తం చేస్తూ మానసికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో బాధితురాలు స్వయంగా విచారణ చేయగా, అతను చూపించిన ఉద్యోగం పూర్తిగా నకిలీదని బయటపడింది. దీంతో మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు నకిలీ ఐడీ కార్డులు, ఒక మొబైల్ ఫోన్, 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని రాసిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మ్యాట్రిమోనియల్ సంబంధాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఉద్యోగం, ఆర్థిక స్థితి, వ్యక్తిగత వివరాలను పూర్తిగా ధ్రువీకరించిన తర్వాతే సంబంధాలు కుదుర్చుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు.

## చైనా తప్పుదారి పట్టించే ప్రయత్నాలు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు పెట్టే చర్యలను భారత్ ఖండించింది. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలు మారవని, అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే కొనసాగుతుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) స్పష్టం చేసింది. మీడియా ప్రశ్నలకు స్పందించిన ఎంఈఏ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, భారత భూభాగంలోని ప్రాంతాలకు పేర్లు పెడుతూ చైనా తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను భారత్ నిర్ద్వంద్వంగా ఖండిస్తుందని తెలిపారు. భారత భూభాగాలను తమవిగా చూపించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సరికావని, ఇలాంటి తప్పుడు చర్యలు వాస్తవాలను మార్చలేవని స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని మరోసారి వెల్లడించారు. చైనా ఇటువంటి నిరాధార చర్యలకు పాల్పడటం వల్ల ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల స్థిరీకరణకు ఆటంకం కలిగే అవకాశం ఉందని తెలిపారు. గతంలోనూ చైనా అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా పేర్కొంటూ పేర్లు మార్చే ప్రయత్నాలు చేయగా, వాటిని భారత్ ఖండించినట్టు వివరించారు.



## ఏటీఎంలలో రూ.1.20 కోట్ల మాయం..
# కస్టోడియన్లు పరార్

- 31 ఏటీఎంల తనిఖీల్లో 8 కేంద్రాల్లో నగదు తక్కువగా గుర్తింపు
- మొత్తం రూ.1,20,98,500 లోటు బయటపడినట్టు సంస్థ గుర్తింపు
- విధులకు రాకుండా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసిన ఇద్దరు కస్టోడియన్లపై అనుమానం
- సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా పోలీసుల గాలింపు చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 12:

ఏటీఎంలలో నింపాల్సిన నగదును దుర్వినియోగం చేసి రూ.1.20 కోట్లతో ఇద్దరు కస్టోడియన్లు పరారైన ఘటన వెలుగుచూసింది. సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన అంతర్గత ఆడిట్‌లో ఈ మోసం బయటపడింది.

వివరాల ప్రకారం, సీఎంఎస్ సంస్థ వివిధ బ్యాంకుల ఏటీఎంలలో నగదు నింపే బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇటీవల ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 31 ఏటీఎంలలో సంస్థ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో 8 ఏటీఎంలలో నగదు తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. మొత్తం రూ.1,20,98,500 లోటు ఉన్నట్టు సంస్థ లెక్కల్లో తేలింది.

ఈ 8 ఏటీఎంల బాధ్యతలు నిర్వహిస్తున్న ఇద్దరు కస్టోడియన్లపై సంస్థ యాజమాన్యం అనుమానం వ్యక్తం చేసింది. కొద్ది రోజులుగా వారు విధులకు హాజరు కాకపోవడం, ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో నగదును దుర్వినియోగం చేసి పరారైనట్టు భావిస్తున్నారు. నగదును ఒకేసారి కాకుండా విడతల వారీగా మళ్లించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సంస్థ బ్రాంచ్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏటీఎం కేంద్రాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



## అమీన్పూర్‌లో ఆక్రమణల
# తొలగింపు వేగం

- 861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ దాదాపు పూర్తి

పటాన్ చెరు, ఏప్రిల్ 12,:

అమీన్పూర్‌లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూముల పరిరక్షణ కోసం హైడ్రా చేపట్టిన చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 861 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి.

శనివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆపరేషన్ రాత్రి వరకు కొనసాగగా, ఆదివారం ఉదయం మళ్లీ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముకీమ్ సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని సుమారు 90 శాతం వరకు కూల్చివేశారు. సమీపంలోని అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటుండటంతో కూల్చివేత ప్రక్రియ కొంత సమయం తీసుకుంటోంది.

అదే సమయంలో, విస్తీర్ణమైన భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. హైడ్రా అధికారులు స్వయంగా అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

స్థానికులు హైడ్రా చర్యలను స్వాగతిస్తూ అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో భయాందోళనల మధ్య జీవించామని, ఇప్పుడు హైడ్రా చర్యలతో భరోసా కలిగిందని వారు చెబుతున్నారు. తమ ఇళ్లను కూల్చబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీతో ఆందోళనలు తొలగిపోయాయని పేర్కొన్నారు.

అక్రమంగా ఆక్రమించి వందల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని భారీగా ఆర్థిక లాభాలు పొందిన వారిపై హైడ్రా కఠిన చర్యలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో హైడ్రా తీసుకుంటున్న చొరవ ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని వారు తెలిపారు.

## భార్యబిడ్డలను స్విమ్మింగ్ పూల్‌లో నెట్టి చంపిన భర్త
## మగబిడ్డ కోసం మరో పెళ్లి చేసుకోవాలని పన్నాగం

కంటోందని ఓ ప్రబుద్ధుడు కట్టుకున్న భార్యనుకడుపున పుట్టిన చిన్నారులను హత్య చేసి రాక్షసుడనిపించుకున్నాడు. హనుమకొండ జిల్లాలో జరిగిన ఈ దురాగతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. భార్యబిడ్డల హత్య కేసులో ప్రధాన నిందితుడు ఆమె భర్తేనని పోలీసులు తేల్చారు. ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ఇద్దరు వైద్యులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

పదేళ్ల క్రితం వారిద్దరికీ వివాహమైంది. ఇద్దరికీ రత్నాల్లాంటి ఆడపిల్లలు కలిగారు. కుమారుడు కావాలన్న దుర్బుద్ధితో భార్యను ఆ భర్త వేధించసాగాడు. అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించాడు. ఆడపిల్లలే అని తెలుసుకుని రెండుసార్లు అబార్షన్ చేయించాడు. ఇటీవల మళ్లీ భార్య గర్భవతి కావడంతో సంతానం వద్దంటూ ఒత్తిడి చేశాడు. ఆపై మరో దురాలోచన చేశాడు. కొన్నాళ్లకు మరో అమానుషానికి పాల్పడి. ప్రస్తుతం జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. ఇంతకీ అతను చేసిన దారుణమేంటి? ఆ భార్యబిడ్డలకు ఏమైంది?

అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్ష : సృష్టికి మూలం స్త్రీయే. మరి ఆమెనేపుట్టకుండా చేస్తే గర్భంలోనే ఆ చిన్నప్రాణాన్ని చిదిమేస్తే అంతకంటే క్రూరత్వం, అమానుషత్వం ఇంకేముంటుంది. వరుసగా ఆడపిల్లలనే



# భేషజాలు లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం

- సిద్దిపేటలో హరిశ్ రావు ఉన్నా పరిశ్రమలు స్థాపిస్తున్నాం
- స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలి
- డిసెంబర్ లోపు ప్రాజెక్ట్ పూర్తి కావాలి
- యువతకు ఉపాధి దొరకాలి
- రాష్ట్ర పరిశ్రమల మంత్రి ద్దుద్దిల్ల శ్రీధర్ బాబు

సిద్దిపేట, ఏప్రిల్ 12,



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 20 ఎకరాల్లో రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ
పరిశ్రమలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. నర్మేట ప్రాంతంలోని వనరులపై పలు సార్లు చర్చలు జరిపి ఈ పరిశ్రమకు రూపకల్పన చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బయో ఫ్యూయల్స్ ప్రాముఖ్యత పెరుగుతోందని, గడ్డి వంటి వనరులతో ఇంధనం తయారు చేయవచ్చని వివరించారు.

పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి కలిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. కాలుష్యం లేని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశం 90శాతం వరకు ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, ఇందులో 65శాతం వంట గ్యాస్ ఇతర దేశాలపై ఆధారపడుతోందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల ప్రభావం వల్ల లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పిజి) సరఫరాపై కూడా ప్రభావం పడుతోందని సూచించారు. "మేక్ ఇన్ ఇండియా" తరహాలో "మేక్ ఇన్ తెలంగాణ" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి వెల్లడించారు. నర్మేటలో ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీలో డిసెంబర్ లోపు గ్యాస్ ఉత్పత్తి కావాలని అన్నారు. ఇక్కడి ఫలితాలు అనుభవించాలని సూచించారు. సిద్దిపేట హరీశ్ రావు ప్రాంతం అయినా పరిశ్రమ తెచ్చామని తమకు ఎలాంటి బెషజాలు లేవని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు బాగుపడాలనేది సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం అన్నారు.

**కాళేశ్వరం ప్రోజెక్ట్ వల్లే సిద్దిపేటకు పరిశ్రమలు**

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ ఇలాంటి పరిశ్రమ సిద్దిపేటకు రావడం ఆనందంగా ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. పరిశ్రమల అభివృద్ధి కోసం ఇప్పటికే 201415 సంవత్సరాల్లో భూ సేకరణ చేపట్టామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, నీటి లభ్యత పెరగడంతో పరిశ్రమలు స్థాపనకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వంటి పరిశ్రమలను ప్రారంభించామని, మరిన్ని ఇండస్ట్రీలు రావడానికి ఇదే కారణమని తెలిపారు. ఇంతకు ముందు నీటి కొరత కారణంగా వరి పంటలు పండించలేక పోయేవారని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. రైతులకు ధాన్యంతో పాటు గడ్డి (ఫోడ్డెర్) ద్వారా కూడా ఆదాయం వస్తోందని చెప్పారు. బయో గ్యాస్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా సుమారు 500 మందికి ఉపాధి కలుగు తోందని, రైతులకు కూడా అదనపు ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయని వెల్లడించారు.

ప్రజలందరూ సహకరించాలని, రాజకీయాలకు అతీతంగా మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రజలు మంచిగా ఉంటేనే పరిశ్రమలు వస్తాయని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై కూడా స్పందించిన హరీష్ రావు, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారత్ సుమారు 50శాతం గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోందని, యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు.

ఇలాంటి బయో గ్యాస్ ప్లాంట్ల వల్ల ఆ సమస్యలను తగ్గించుకోవచ్చని, దిగుమతులను తగ్గించి స్వయం సమృద్ధి సాధించవచ్చని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు.

# బీఆర్ఎస్‌గా మారాక నష్టపోయాం

- మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన చేస్తున్నాం
- రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రకు సిద్ధం
- వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేదు
- కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం తీసుకురావడమే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.

టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చడం వల్ల పార్టీకి నష్టం జరిగిందని కేటీఆర్ అంగీకరించారు. ప్రజల్లో బలంగా ఉన్న తెలంగాణ సెంటిమెంట్ పేరు మార్పుతో కొంత తగ్గిందని భావిస్తున్నట్లు చెప్పారు. పార్టీని తిరిగి టీఆర్ఎస్ పేరుతో కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. దీంతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పేర్కొన్నారు.

గత పదేళ్ల పాలనలో ప్రభుత్వం, ప్రజల మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యమని వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరిగితే తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఖండించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని తెలిపారు.

ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





# మండుటెండలో సన్న బియ్యం తీసుకునేందుకు అష్టకష్టాలు సాంకేతిక సమస్యలతో జనం పడిగాపులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో రేషన్ బియ్యం మూడు నెలల పంపిణీ ప్రక్రియలో పలు సాంకేతిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి కార్డుదారులు చౌక ధరల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్న ఉదయం నుంచే బియ్యం తీసుకునేందుకు అల్లాడిపోతున్నారు. డీలర్లు జనం తాకిడి తట్టుకోలేక టోకెన్లు జారీ చేసి రోజూ 40 నుంచి 50 మందికి మాత్రమే ఇస్తున్నారు. చాలా మంది రోజుల తరబడి రేషన్ షాపులకు తిరుగుతూ బియ్యం దొరక్క తీవ్ర నిరుత్సాహంతో వెనుదిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

బియ్యం దొరకవనే భయంతో : రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల్లో రేషన్ బియ్యం తీసుకోవడం కార్డుదారులకు ప్రహసనంలా మారింది. తరుచూ సర్వర్ మొరాయిస్తుండటం, నెట్‌వర్క్ సమస్యలతో సరఫరా ప్రక్రియ ఆలస్యమవడం ప్రజలకు పరీక్షపెడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు కలిపి రేషన్ బియ్యం ఒకేసారి అందజేస్తున్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో చౌక ధరల దుకాణాల వద్ద కార్డుదారుల రద్దీ కనిపిస్తోంది. బియ్యం పంపిణీ ఈనెల మొత్తం కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కార్డుదారులు బియ్యం దొరకవనే భయంతో భారీ స్థాయిలో క్యూ కడుతున్నారు.

గంటలకొద్ది నిరీక్షణ : బయో మెట్రిక్ వేలిముద్ర మూడుసార్లు తీసుకుని బియ్యం తూకం వేయాల్సి వస్తుండటంతో బాగా ఆలస్యం అవుతోంది. కొన్ని చోట్ల స్టాక్ లేదంటూ మూసివేస్తుండగా మరికొన్ని చోట్ల డీలర్లు ఒక్కపూట మాత్రమే దుకాణాలు తెరుస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు. పనులన్నీ మానుకుని గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుకాణాల మధ్య ఎగబడుతున్న జనం : సన్న బియ్యం పంపిణీ పథకం కింద ఒక్కో వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి 18 కిలోల బియ్యం అందిస్తున్నారు. తెల్లవారుజామునే రేషన్ షాపుల వద్ద జనం ఎగబడుతున్నారు. కార్డుదారులను నియంత్రించేందుకు కొందరు డీలర్లు టోకెన్లు అందించి అందుకు అనుగుణంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కోసారి సాంకేతికంగా సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు కార్డుదారుల సహనానికి పరీక్షపెడుతున్నాయి.

## న్యాయవాది సుబ్బారావుపై ఫిర్యాదు చేసిన మంగ్లీ
# ఫైనాన్స్ మోసం కేసుతో సంబంధం లేదని వెల్లడి

హైదరాబాద్:

తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ న్యాయవాది సుబ్బారావుపై గాయని మంగ్లీ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేశారు. తన తరఫు న్యాయవాదితో కలిసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మంగ్లీ లిఖిత పూర్వక ఫిర్యాదును పోలీసులకు అందజేశారు. మైక్రోఫైనాన్స్ పేరుతో మంగ్లీ రూ.10 కోట్లు మోసం చేశారని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో అడ్వకేట్ సుబ్బారావు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే

బాధితుల తరఫున నేను పోరాడుతాను : ఇటీవల న్యాయవాది సుబ్బారావు తన ఆఫీస్‌కు వద్దకు వచ్చి రూ.10 లక్షలు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకు దుర్భాషలాడుతూ మీడియాలో దుష్ప్రచారం చేస్తానని బెదిరించారని ఫిర్యాదులో మంగ్లీ పేర్కొన్నారు. న్యాయవాది సుబ్బారావు తనపై దుష్ప్రచారం చేసి, ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఫైనాన్స్ మోసం కేసుతో తమకు సంబంధం లేదని తెలిపారు. తనకు చేతినిండా పని ఉందని, ప్రజలను మోసం చేసే పని చేయనని చెప్పారు. బాధితుల తరఫున తాను కూడా పోరాడుతానని అన్నారు. తనకు డబ్బు ఆశ లేదని, పాటలే తన ప్రపంచంగా జీవిస్తున్నానని,



కష్టపడి ఈ స్థాయికి వచ్చానని పేర్కొన్నారు. తన మూలాలు మర్చిపోనని, తన తమ్ముడిపై కూడా ఆరోపణలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు కట్టలతో ఉన్న వ్యక్తి తన తమ్ముడు కాదని వివరించారు.


"న్యాయవాది సుబ్బు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నాపై దుష్ప్రచారం చేసి ప్రాచుర్యం పొందాలని చూస్తున్నాడు. ఫైనాన్స్ మోసం కేసుతో నాకు సంబంధం లేదు. నాకు చేతి నిండా పని ఉంది.. ప్రజలను మోసం చేసే పనులు చేయను. బాధితుల తరఫున నేను కూడా పోరాడతాను" మంగ్లీ, గాయని

మంగ్లీ కేసుతో సంబంధం లేదు : మంగ్లీ కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని దర్శకుడు వేణు ఉడుగుల స్పష్టం చేశారు. ఈ కేసులో తనని భాగం చేస్తూ మీడియాలో వచ్చిన కథనాలు తనను ఎంతగానో బాధపెట్టాయని తెలిపారు. ఈ మేరకు సోషల్‌మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. మంగ్లీ కేసుతో అనుసంధానం చేస్తూ తన పేరుపై మీడియాలో వచ్చిన వార్తలు చూసి బాధపడ్డానని తెలిపారు. ఆ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. మంగ్లీ, ఫిర్యాదు చేసిన న్యాయవాది సబ్బారావు ఇద్దరూ తనకు పరిచయం ఉన్న వ్యక్తులు కావడంతో, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూపడమని మాత్రమే సూచించానని అన్నారు. అంతకుమించి ఇందులో ఎలాంటి పాత్ర పోషించలేదని, ఈ సందర్భంగా ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నానని అన్నారు.

ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో కూడా తన పేరు నిందితుడిగా ఎక్కడా ప్రస్తావించలేదని, అలాగే ఈ కేసు పెట్టిన సుబ్బారావు ఈ రోజు మీడియా ముందు మాట్లాడుతూ, తనకు ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పారని అన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా తన పేరును ఈ వ్యవహారంతో కలిపి ప్రచారం చేయడం బాధాకరమని తెలిపారు. పోలీసులు కూడా దీనితో తనకు సంబంధం లేదని నిర్ధారించారని అన్నారు. ఒక వ్యక్తి పరువు, కుటుంబ మర్యాద ఇలాంటి వార్తల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తన విన్నపమని పేర్కొన్నారు.

# ప్రజలను ఎక్కువగా భయపెడుతోన్న వ్యాధులు ఇవే..





2025 సంవత్సరం మరికొన్ని రోజుల్లో మనకు వీడ్కోలు చెప్పబోతోంది. కానీ ఆరోగ్య విషయానికి వస్తే, ఈ సంవత్సరం మనందరికీ ఎన్నో భయానక అనుభవాలను మిగిల్చింది. టెక్నాలజీ, ఏఐ వంటి అభివృద్ధులు మన జీవితాలను సులభం చేసినప్పటికీ, మన ఆరోగ్యం మాత్రం అనేక సమస్యలను ఎదుర్కొంది. పిల్లలు, యువకులు, వృద్ధులు అన్న తేడా లేకుండా చాలా మంది తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎన్నో కుటుంబాలు తమ ప్రియమైన వారిని కోల్పోయి రోడ్డున పడ్డాయి. భారతదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా 2025లో అనేక వ్యాధులు తీవ్ర ప్రభావం చూపాయి. గుండె జబ్బులు, డయాబెటిస్, ఊబకాయం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా పెద్ద సమస్యగా నిలిచాయి. అలాగే.. వైరల్ జ్వరాలు, శ్వాసకోశ సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల వచ్చే అనారోగ్యాలు ఈ ఏడాది ఎక్కువగా కనిపించాయి.

### గుండె జబ్బులు

ఈ సంవత్సరం ఆరోగ్య పరంగా ఎక్కువగా భయపెట్టిన సమస్యలలో గుండె జబ్బులు మొదటి స్థానంలో ఉన్నాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికే వచ్చే వ్యాధిగా భావించిన గుండెపోటు, ఇప్పుడు చిన్న వయసు వారినీ కూడా ప్రభావితం చేస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా గుండెపోటుతో మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల జిమ్‌లో వ్యాయామం చేస్తూ, ఆటలు ఆడుతూ లేదా సాధారణ పనులు చేస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోయిన వారి వీడియోలు సోషల్ మీడియాలో తరచుగా కనిపిస్తున్నాయి.

2025లో ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఆరోగ్యంగా కనిపించే యువకుల్లో గుండెపోటు కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (%చీజ=దీ%) నివేదిక ప్రకారం, భారతదేశంలో జరిగే మొత్తం మరణాలలో దాదాపు మూడో వంతు గుండెపోటుల వల్లనే జరుగుతున్నాయి. దీని వల్ల గుండె జబ్బులు దేశంలో మరణాలకు ప్రధాన కారణంగా మారాయని స్పష్టమవుతోంది.

### గుండె జబ్బులను ఎలా నివారించాలి?

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలి చాలా ముఖ్యమైనది.
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి
రోజూ వ్యాయామం చేయాలి
బరువును నియంత్రణలో ఉంచాలి
పొగ తాగడం మానేయాలి
ఒత్తిడిని తగ్గించుకోవాలి
తగినంత నిద్రపోవాలి

### క్యాన్సర్

క్యాన్సర్ ప్రస్తుతం భారతదేశంలో ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), భారతీయ వైద్య పరిశోధనా మండలి (ICMR) గణాంకాల ప్రకారం, ప్రతి సంవత్సరం దేశంలో లక్షల సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తించబడుతున్నాయి. 2026 నాటికి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2025 నాటికి భారతదేశంలో సుమారు 2.5 మిలియన్లకు పైగా ప్రజలు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.

ప్రతి సంవత్సరం 7 లక్షలకుపైగా కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యం సేవించడం, అనారోగ్యకరమైన జీవనశైలి ఇవన్నీ క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కనిపిస్తాయి. పురుషుల్లో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదం ఎక్కువ. రోజుకు సగటున సుమారు 2,500 మంది క్యాన్సర్ వల్ల మరణిస్తున్నారు. అందువల్ల క్యాన్సర్ భారతదేశంలో ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా ఉంది.

### క్యాన్సర్ ఎలా నివారించాలి?

జీవనశైలి మార్పులు చాలా ముఖ్యమైనవి
పొగాకు, ధూమపానాన్ని పూర్తిగా మానేయండి.
మద్యపానాన్ని నియంత్రించండి
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి
క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.

### శ్వాసకోశ వ్యాధి

భారతదేశంలో COPD (Chronic Obstructive Pulmonary Disease) చాలా వేగంగా పెరుగుతోంది. ఇది ఆస్తమా, క్షయ, న్యుమోనియా వంటి ఇతర శ్వాసకోశ వ్యాధులకంటే పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. COPD తరచుగా అల్ప లక్షణాలతో ప్రారంభమవుతుంది. దీన్ని పూర్తిగా కోలుకోవడం సాధ్యం కాదు. కేవలం లక్షణాలను నియంత్రించవచ్చు.

ప్రస్తుతం భారతదేశంలో 50–55 మిలియన్ల మంది COPDతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 1.5 మిలియన్ల మంది దీని వల్ల మరణిస్తున్నారు. ఇది కేవలం గణాంకాలు మాత్రమే కాదు, నెమ్మదిగా పెరుగుతున్న జాతీయ ఆరోగ్య సమస్య. COPD% మరణాల రేటు ఉబ్బసం, క్షయ, న్యుమోనియాకు కంటే వేగంగా పెరుగుతోంది.

### ఫ్యాటీ లివర్, డయాబెటిస్

భారతదేశంలో ఫ్యాటీ లివర్ వ్యాధి (Fatty Liver Disease), టైప్ 2 డయాబెటిస్ (Type 2 Diabetes)తో బాధపడే వ్యక్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఈ రెండు వ్యాధులు ఒకదానికి సంబంధించి ఉంటాయి అని నిపుణులు గుర్తించారు. డయాబెటిస్ ఉన్నప్పుడు ఫ్యాటీ లివర్ మరింత తీవ్రమవుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నప్పుడు డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ. ఈ రెండు వ్యాధులు ఊబకాయం (Obesity), ఇన్సులిన్ నిరోధకత (Insulin Resistance) వల్ల ఏర్పడతాయి.

### నివారణ

ఫ్యాటీ లివర్, డయాబెటిస్‌ని నియంత్రించడానికి జీవనశైలి మార్పులు చాలా ముఖ్యం
ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం
వర్క్-అవుట్ / వ్యాయామం
బరువు సరిగా ఉంచుకోవడం
తగినంత నిద్ర
రెగ్యులర్‌గా రక్త చక్కెర, కాలేయ ఫంక్షన్ పరీక్షలు చేయించుకోవడం

ఈ వ్యాధులు పట్టించుకోకపోతే కాలేయ క్యాన్సర్, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. కాబట్టి ముందే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం.

### ఊబకాయం

భారతదేశంలో ఊబకాయం ఒక అంటువ్యాధిగా మారింది. శరీరంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల ఇది సంభవిస్తుంది. నేడు చిన్నపిల్లలు, పెద్దలు ఇద్దరూ అధిక %దీవీ×%, అధిక శరీర కొవ్వు వంటి శారీరక సమస్యలతో పోరాడుతున్నారు. ఆరుబయట ఆడుకునే సమయం తక్కువగా ఉండటం, అధిక కొవ్వు ఉన్న జంక్ ఫుడ్ తినడం, రోజులో ఎక్కువ సమయం %ూాజ% గదులలో సౌకర్యవంతంగా గడపడం వల్ల, 30 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ పిల్లలు ఊబకాయంతో బాధపడుతున్నారు.

### మానసిక ఆరోగ్య సంక్షోభం

WHO ప్రకారం, మానసిక ఆరోగ్య సంక్షోభం అనేది ఒక తీవ్రమైన పరిస్థితి, దీనిలో ఒత్తిడి తట్టుకునే సామర్థ్యాలను అధిగమిస్తుంది. ఇది తీవ్రమైన భావోద్వేగాలు, గందరగోళం లేదా ఆత్మహత్య ఆలోచనలు, తీవ్రమైన ఆందోళన లేదా సైకోసిస్ వంటి తనకు లేదా ఇతరులకు హాని కలిగించే ప్రవర్తనలకు దారితీస్తుంది. 2025లో ముఖ్యంగా యువత నిరంతర ఒత్తిడి, డిజిటల్ అలసట, ఆర్థిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం వంటి సమస్యలతో పోరాడుతున్నారు. ఇది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. పెరుగుతున్న అంటు వ్యాధుల వ్యాప్తి కూడా ప్రజలను చాలా ఇబ్బంది పెట్టింది. పెరుగుతున్న అంటు వ్యాధుల వ్యాప్తి ప్రపంచ ఆరోగ్యానికి తీవ్రమైన సవాలుగా మిగిలిపోయింది.

# ఈ పండ్లను తింటే మీకు అసలు క్యాన్సర్ రాదు..

ప్రస్తుతం భారతీయులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లల్లో క్యాన్సర్ కూడా ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందనే చెప్పవచ్చు. జీవన విధానంలో మార్పులు, ధూమపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, రేడియేషన్ కు ఎక్కువగా గురవ్వడం, రసాయనాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ఈ వ్యాధికి సరైన మందు లేదనే విషయం మనందరికీ తెలిసిందే. కనుక వ్యాధి బారిన పడి బాధపడడానికి బదులుగా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో మార్పులు చేసుకోవడం మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.



### మామిడి, నేరేడు..

క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కొన్ని రకాల పండ్లు మనకు ఎంతగానో దోహదపడతాయని వారు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదల తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించే పండ్ల గురించి వివరాలను అందిస్తున్నారు. మామిడి పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల అసాధారణ కణాల పెరుగుదల వేగం తగ్గుతుంది. అలాగే నేరేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ప్రొలిఫెరేటివ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి హానికారక కణాల వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి.

### ఉసిరి, మారేడు..

ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కూడా మనం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఉసిరిలో ప్రీక్లినికల్ నమూనాలు ఉంటాయని వీటి సారం క్యాన్సర్ పై ఆశాజనక ప్రభావాలను చూపించదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కోకుమ్ అనే పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఈ పండ్లల్లో ఫైటోకెమికల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అదేవిధంగా మారేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో దోహదపడతాయని చెబుతున్నారు. ఇవి క్యాన్సర్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని వీటిలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు కణాలను రక్షించడంలో సహాయపడతాయని తెలియజేస్తున్నారు.

### పనస, వాక్కాయలు..

అలాగే ఆహారంలో భాగంగా పనస పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇవి కణాల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి క్యాన్సర్ ను నిరోధించడంలో ఎంతో దోహదపడతాయి. క్యాన్సర్ ను ఎదుర్కోవడంలో వాక్కాయ పండ్లు కూడా మనకు ఎంతో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే రక్షణ సమ్మేళనాలు క్యాన్సర్ మార్పులను నివారించడంలో తోడ్పడతాయి. ఇక మంకీ జాక్ ఫ్రూట్ పండ్లు కూడా క్యాన్సర్ అభివృద్ధిని తగ్గిస్తాయి. ఈ పండ్లు మనలో చాలా మందికి తెలియవు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ క్యాన్సర్ వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి. ఈ విధంగా ఈ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాప్తి తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తగ్గుతాయి.



# శీతాకాలంలో కీళ్ల నొప్పి.. ఎందుకు వస్తుందో తెలుసా?

శీతాకాలంలో కీళ్ల నొప్పులు, వాపు లేదా నడవడానికి ఇబ్బందిగా అనిపిస్తే జాగ్రత్త వహించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగే లక్షణం కావచ్చు. ఇప్పటికే ఈ పరిస్థితి ఉన్నవారు శీతాకాలంలో ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటారు. వేసవిలో కంటే శీతాకాలంలో ప్రజలు తక్కువ నీరు తాగుతారు. ఈ సీజన్‌లో ఆహారపు విధానాలు కూడా మారుతాయి, ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడానికి ప్రధాన కారణంగా పరిగణిస్తారు.

శీతాకాలంలో ప్రజలు మాంసం, గుడ్లు ఎక్కువగా తింటారు. వీటిలో ప్యూరిన్లు ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచుతాయి . ఈ సీజన్‌లో శారీరక శ్రమ వేసవిలో కంటే తక్కువగా ఉంటుంది. ఇది జీవక్రియను నెమ్మదిస్తుంది. యూరిక్ యాసిడ్ పేరుకుపోవడానికి కారణమవుతుంది. కొన్ని సందర్భాల్లో, కీళ్లలో యూరిక్ యాసిడ్ స్ఫటికాలు పేరుకుపోతాయి. దీనివల్ల కీళ్ల నొప్పులు, నడవడానికి ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికే ఈ పరిస్థితులు ఉన్నవారికి, సమస్య మరింత తీవ్రమవుతుంది.

### యూరిక్ యాసిడ్ పెరుగుదల లక్షణాలు ఏమిటి?

- కాలి బొటనవేలులో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి
- మోకాళ్లలో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి
- వాపు కీళ్ళు
- ఉదయం నిద్ర లేచినప్పుడు నడవడానికి ఇబ్బంది పడటం
- గౌట్ వచ్చే ప్రమాదం
- యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువ కాలం పాటు ఉంటే, అది గౌట్‌కు దారితీస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. ఈ పరిస్థితి తీవ్రమైన కీళ్ల నొప్పికి కారణమవుతుంది. చికిత్సకు సరైన ఆహారం, మందులు తీసుకోవడం అవసరం.

### యూరిక్ యాసిడ్‌ను ఎలా నియంత్రించాలి?

- శీతాకాలంలో కూడా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోండి.
- ఎర్ర మాంసం, కిడ్నీ బీన్స్ కు దూరంగా ఉండండి
- అధిక ప్యూరిన్ ఆహారాలను పరిమితం చేయండి
- మద్యానికి దూరంగా ఉండండి

# నవోదయలో మెరిసిన యశస్విని

**గ్రామానికి గర్వంగా నిలిచిన కిష్టాపూర్ కూతురు**



**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** గ్రామీణ ప్రాంతాల నుంచే ప్రతిభలు వెలుగులోకి వస్తాయని మరోసారి నిరూపించింది బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాచ బోయిన యశస్విని. జవహర్ నవోదయ విద్యాలయం లో జిల్లాస్థాయిలో 19 వ ర్యాంక్ పొంది నిజాంసాగర్‌లో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ యువకులు ఆమెను ఘనంగా సన్మానించారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపిన యశస్విని, కష్టపడి సాధించిన ఈ విజయంతో తల్లిదండ్రులకు, గ్రామానికి పేరుతెచ్చింది. సాధారణ కుటుంబానికి చెందిన ఆమె, క్రమశిక్షణతో చదువుకుంటూ ఈ స్థాయికి చేరుకోవడం ప్రశంసనీయం అని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. యశస్విని విజయాన్ని పురస్కరించుకొని గ్రామ యువత పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యువ నాయకులు భుజముల భాస్కర్ మాట్లాడుతూ....., "గ్రామంలో ఉన్న ఇతర విద్యార్థులకు యశస్విని ఆదర్శంగా నిలవాలి" అని సూచించారు. యశస్విని మాట్లాడుతూ, "తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగాను" అని తెలిపింది. భవిష్యత్తులో ఇంకా మంచి స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని పేర్కొంది. గ్రామంలో ఆమె విజయంతో ఆనంద వాతావరణం నెలకొంది. యశస్వినిలాంటి ప్రతిభావంతులు మరింత ముందుకు రావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హట్కరి కృష్ణ, యువ నాయకులు బుజ్జముల భాస్కర్, వార్డ్ మెంబర్లు గోపాల్, అరుణ, సాయిలు, కృష్ణమూర్తి, యువ నాయకులు సంజీవ్, లక్ష్మణ్, యాదు, మల్లేష్, హన్మండ్లు, కొట్టే రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి ఇంటర్ ఫలితాల్లో ప్రతిభా ప్రదర్శన

**గౌతమ్ కాలేజీ అంటేనే ఒక విజన్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో నేలకొండపల్లి గౌతమి కాలేజీ లోఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో వై. లక్ష్మీ ప్రియ, జే. గౌతమ్ ఇద్దరూ 462 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. అలాగే ఎంపీసీ రెండవ సంవత్సరం ఫలితాల్లో రజనీష్ యాదవ్ 981 మార్కులు సాధించి గౌతమి కాలేజీ టాపర్‌గా నిలిచి కాలేజీ కి ఈ ప్రాంతానికి గర్వకారణమయ్యాడు. విద్యార్థులు ఈ విజయంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయలకి యాజమాన్యంకి నేల్లూరి వీరభద్రం, కోటేశ్వరరావుకి అభినందనలు తెలియజేశారు.

# ప్రతిభ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** ఆదివారం ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జూనియర్ ఇంటర్ ఎంపిసి లో తమ కాలేజి విద్యార్థులు శివాని, పృద్వితేజలు 470 మార్కులకు గాను 468 మార్కులు సాదించారని, సింధు 467మార్కులు సాదించిందని ప్రతిభ కాలేజ్ సెక్రటరీ, కరస్పాండెంట్ వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ సత్యం బాబు తెలిపారు.32 మంది విద్యార్థులు 460 కి పైగా మార్కులు సాదించారని వారు తెలిపారు. బైపిసి విభాగంలో స్టేట్ ర్యాంక్ 440 మార్కులకు బిందు శ్రీ కి 436 మార్కులు, సందీప్ 435, స్ఫూర్తికి 434 మార్కులు వచ్చాయని చెప్పారు. 105 మంది విద్యార్థులు 400 కి పైగా మార్కులు సాదించారని వారు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి ఫలితాలలో 1000 మార్కులకు గాను కోన సంజన 994 , ప్రణతి, సానియా, ప్రవల్లిక లు 992 మార్కులు సాదించారని వారు తెలిపారు.బైపిసి విభాగంలో కావేటి వైష్ణవి 983, అఖిల 980 మార్కులు వచ్చాయని చెప్పారు. 121 మంది విద్యార్థులు 900 కు పైగా మార్కులు సాదించారని వారు తెలిపారు.ఇంతటి అద్భుతమైన విజయం సాధించిన విద్యార్ధిని, విద్యార్థులకు ,తల్లిదండ్రులకు, అద్యాపకులకు ధన్యవాదములు తెలిపారు.

# పేకాట రాయుళ్లు అరెస్ట్

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఇస్సన్న పల్లి గ్రామ శివారులో మధ్యాహ్నం అందాజా మూడు గంటల ప్రాంతంలో ఏడుగురు ఈసన్నపల్లి గ్రామస్తులు పేకాట ఆడుతుండగా రైడ్ చేసి పోలీసులు పట్టుకోవడం జరిగింది, వీరి వద్ద నుండి 5700 రూపాయలు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

# బీ గ్రేడ్‌లో ఇంటర్ విద్యార్థి ఉత్తీర్ణత

**పరీక్షల్లో తప్పుతానని ఆత్మహత్య చేసుకున్న అక్షాంత్**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.. అయితే ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో అద్భుతమైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. ఖమ్మం జిల్లా, బోనకల్ మండలంరాంపల్లి గ్రామానికి చెందిన గంగదేవుళ్ల అక్షాంత్ కొద్ది రోజుల క్రితం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశాడు.అయితే పరీక్షలు సరిగ్గా రాయలేదని.. తప్పుతానన్న భయంతో ఆ విద్యార్థి గురువారం మధిర రైల్వే స్టేషన్ లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.దీంతో ఆ కుటుంబంలో, ఆ గ్రామంలో విషాదం నెలకొంది. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియ ట్ ఫలితాల్లో అక్షాంత్ బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించాడు. ఫలితాలు రాకముందే అక్షాంత్ ఆత్మహత్య చేసుకోవడం, నేడు ఫలితాల్లో పాస్ కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

# ఇంటర్ ఫలితాల్లో జయ విజయకేతనం




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** జిల్లా కేంద్రంలోని జయ కాలేజ్ లో ఆదివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో జయకేతనం ఎగరవేశారు.ఎంపీసీ విభాగంలో టీ భూమిక,జి శివమణి,బి సాయి సిరి,ఏ మహిజ,జి నిత్యశ్రీ, ఎల్ సంజన,ఎం అనన్య, సాయి లిక్షిత, మాధురి,సాయి చర్విత, సాయి హిర్విత,467 మార్కులు,సాయి ప్రణవి ,భావన,దీక్షిత,మాన్విత, సంజన 466 మార్కులు,విశ్వ సేనగౌడ్,సాయి రెడ్డి,హాసిని, చరణ్య,460 కి పైగా 43 మంది, 450 కి పైగా 84 మంది విద్యార్థులు మార్కులు సాధించారు.

**ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో**

ఎంపీసీ విభాగంలో డి సిరి 994, జి. శ్రీనిక 992, ఎం బవ్యశ్రీ 992, ఎస్ అశ్వర్ధన్ 991, జి మనో వర్షిత 991, ఎండి ముస్కాన్ 990, సిహెచ్ జయశ్రీ 989, ఎస్కె షాదియా ఇర్ఫాన్ 988, జి శ్రీజ 988, డి వెన్నెల 988, ఎం తీర్థశ్రీ 988, తేజస్వి 987 ఎన్ శ్రీలక్ష్మి 987, కే స్లేష్మ 987,ఎన్ హరిణి 985, ఎం తేజస్విని 985, ఎస్ కే నేహా 984, ఏ వినయ్ 984, జి లాస్య 984, బి జ్ఞాన సాయి 983, ఎం దయ సాగరాచార్యులు 983, వి గౌతమ్ కుమార్ 982 ఎన్ సందీప్తి 982, కె శశిధర్ రెడ్డి 981, సిహెచ్ ల్యూసివెన్సీ 981, కే గౌతమి 981, ఎం నవ్య శ్రీ 981, ఎం నవ్యశ్రీ 981, వై హరీనా శర్మ 981, బి నవనీత 980 అలాగే 980 కి పైగా 32 మంది 950 కి పైగా 109 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో కే శ్రుతి 985, జే మానస 981, జే శ్రీ నిత్య 980 మార్కులు సాధించారు. విద్యార్థులను,కృషి చేసిన అధ్యాపకు బృందాన్ని సహకారం అందించిన తల్లిదండ్రులను కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్,డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మాలు అభినందించారు.

# చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల విజయం






**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఇంటర్ ఫలితాల్లో శంకర్ పల్లి చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం సృష్టించింది. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శంకర్ పల్లిలోని చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి తమ విజయకేతనాన్ని ఎగురవేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల కీర్తిని చాటిచెప్పారని కళాశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేశారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో సి హెచ్ నరేష్ 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. అదేవిధంగా ఎంపీసీలో దియా తబస్సుమ్ (954), బైపీసీలో శ్రీ దివ్య (988), తనిషా (983), సీఈసీలో పి అనిత (985), చంచల్ (979), రాధిక (972) మార్కులు సాధించారు. ఎంఈసీలో కె మధుప్రియ (969) సాధించి కళాశాలను మరో మెట్టు ఎక్కించారు. ప్రథమ సంవత్సరంలో కూడా విద్యార్థులు అత్యున్నత మార్కులతో మెరిశారు. ఎంపీసీ విభాగంలో డి ఇందు (459) మార్కులు,లిఖిత తన్వీర్ (457) మార్కులు, భాను ప్రసాద్ (457) మార్కులు సాధించడం విశేషం. బైపీసీ విభాగంలో సిహెచ్ సింధు 425 మార్కులు, మౌనిక 424 మార్కులు సాధించారు. అదేవిధంగా సీఈసీ విభాగంలో నాజియా 475 మార్కులు, మహేశ్వరి 474 మార్కులు. విగ్నేష్ (444), సుచిత్ర 443 మార్కులు సాధించారు. విద్యార్థుల అద్భుత ప్రతిభపై కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ యాదగిరి రెడ్డి, కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థులు కష్టపడి చదివిన విధానమే ఈ విజయానికి కారణమని వారు పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను కళాశాల వారు ప్రత్యేకంగా అభినందించారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కొత్తగడి విద్యార్థినుల ప్రభంజనం

- **హర్షం వ్యక్తం చేసిన కళాశాల ప్రిన్సిపల్ సాయిలత సిబ్బంది**







**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో వికారాబాద్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల కొత్తగడి విద్యార్థినులు రికార్డు స్థాయి మార్కులతో సంచలనం సృష్టించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలను సాధించి, రాష్ట్ర స్థాయి ర్యాంకులతో తమ ప్రతిభను చాటుకున్నారు. జిల్లా స్థాయిలో మెరిసిన ఆణిముత్యాలు ఈ ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా స్థాయి ర్యాంకులు సాధించి కళాశాల కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు: స్పందన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం 1000 మార్కులకు గాను 985 మార్కులు, సిహెచ్ వాసవి బైపిసి 984, నవనీత ద్వితీయ సంవత్సరం 1000 మార్కులకు గాను 973 మార్కులు సాధించి, జిల్లా స్థాయి ర్యాంకును దక్కించుకున్నారు.విద్యార్థినుల అద్భుత ప్రతిభపై పట్టణ ప్రముఖులు, విద్యావేత్తలు ప్రశంసలు కురిపిస్తున్నారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల విజయానికి నిరంతరం కృషి చేసిన ప్రిన్సిపాల్ సాయిలత ను,అధ్యాపక బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయి.

# అధికార పార్టీ నాయకులు భూ దందాలు మానుకోవాలి

- **టీఆర్పి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 29వ వార్డులో ఉన్న వజ్రా హోమ్స్ లో 2015 నుంచి 2018 వరకు అన్ని అనుమతులు తీసుకొని సక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఇండ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారని ప్రస్తుతం నల్ల ఉమా జ్యోతి రెడ్డి తప్పుడు దస్తావేజులు సృష్టించి అక్రమంగా అధికార పార్టీ నాయకులు వజ్రా హోమ్స్ లో స్థలాలను ఆక్రమించుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. ఆదివారం వజ్రా హోమ్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .నన్ను ఉమా జ్యోతి రెడ్డికి వజ్రా హోమ్స్ లో ఎలాంటి భూమి లేకుండా తప్పుడు దస్తావేజులు సృష్టించి వజ్రా హుంలో 9000 గజాలు తన భర్త చిత్తరంజన్ రెడ్డి పేరా ఉన్నట్లు చూపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.ఈ విషయమై గతంలో తాను చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం కోర్టు కేసులను క్లియర్ చేసి రిజిస్ట్రేషన్ చేస్తానని నమ్మించి తన వద్ద డబ్బులు తీసుకొని ప్రస్తుతం తప్పుడు పత్రాలతో భార్యాభర్తలు అధికార పార్టీ నాయకులతో అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు.ఈ విషయమై సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదయిందని అనంతరం తప్పుడు దస్తావేజులు రద్దు చేసుకుంటామని మాట్లాడి తన నుంచి 20 లక్షలు తీసుకొని అమెరికాకు వెళ్ళిపోయినదని అన్నారు. ప్రస్తుతం ఆ తప్పుడు దస్తావేజుల ద్వారా అగ్రిమెంట్ చేసుకున్న అధికార పార్టీని కూడా మోసం చేయగా వారు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారని తెలిపారు. గత ఫిబ్రవరి మాసంలో అమెరికా నుండి హైదరాబాద్ కు వచ్చి అధికార పార్టీ నాయకుల అండదండలతో ఎలాంటి భూమి లేకున్నా తప్పుడు దస్తావేజుల ద్వారా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.ఈ విషయమై వజ్రా హోమ్స్ మేనేజింగ్ పార్ట్నర్స్ కు తెలియక వారు న్యాయ సలహా మేరకు వజ్రా హోమ్స్ లో నల్ల చిత్తరంజన్ రెడ్డి నల్ల ఉమా జ్యోతి రెడ్డిల ద్వారా ఎలాంటి విక్రయ లావాదేవీలు జరుపకూడదని బహిరంగ ప్రకటన కూడా విడుదల చేయడం జరిగిందనీ ఈ విషయాలు సూర్యాపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం నోటీసు ద్వారా కూడా తెలియజేయడం జరిగిందన్నారు. నల్ల ఉమా జ్యోతి రెడ్డి నల్ల చింత రంజన్ రెడ్డి లపై పలుమార్లు చీటింగ్ కేసు అయినప్పటికీ మరల మోసం చేయాలని ఆలోచనతో వజ్రా హోమ్స్ లో ఉన్న ప్లాట్లను ఇండ్ల స్థలాలను ఆక్రమించుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తు న్నారనీ వీరిపై విచారణ చేసి మరల ఇలాంటి మోసాలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ఇంటర్ ఫలితాల్లో 4వ స్థానంలో ఖమ్మం

- 72.06శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు హర్షం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్** : తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలను ఒకే సారి విడుదల చేయగా, ఆ ఫలితాల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలోనే నాల్గవ స్థానంలో ఖమ్మం జిల్లా నిలిచినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది మొదటి, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 29,856 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 22,961 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో మొదటి సంవత్సరం మొత్తం 15,299 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 11,025 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిగా, రాష్ట్రంలో నాల్గవ స్థానం వచ్చినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ కు మొత్తం 14,627 మంది విద్యార్థులు పరీక్షల రాయగా, 11,936 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందుకు గాను 81.60 శాతం నమోదు కాగా, రాష్ట్రంలో ఆరవ స్థానంలో ఖమ్మం జిల్లా నిలిచినట్లు రవిబాబు తెలిపారు. ఈ సంవత్సరం ఇంత మంచి ఫలితాలను అందించిన విద్యార్థులందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. అలాగే అధ్యాపక బృందానికి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఖమ్మం జిల్లాను ఉంచే విధంగా పనిచేస్తామని అకాంక్షించారు.

### మే 13న అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

ప్రస్తుతం ఫలితాలు విడుదల కాగా, ఆ ఫలితాలపై అనుమానాలు ఉన్న విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అప్లే చేసుకునే అవకాశం ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు తెలిపారు. ఈనెల 13 నుంచి 20 రకు విద్యార్థి ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రీకౌంటింగ్ కు ప్రతి సబ్జెక్ట్ రూ.100 చొప్పున, రీ వెరిఫికేషన్ కు ప్రతి సబ్జెక్ట్ కు రూ.800చొప్పున ఫీజు చెల్లించాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ డ్ సప్లమెంటరీ పరీక్షలు వచ్చే నెల 13 నుంచి నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన విద్యార్థులు ఈనెల 13 నుంచి 20 వరకు కాలేజీల పరీక్ష పీజు చెల్లించాలని సూచించారు.

# అడుక్కుంటే ఇచ్చెటోళ్లం!

- క్యాతనపల్లిలో మంత్రి ఎమర్జెన్సీని తలపించిండు
- కాంగ్రెస్ ప్రభుత్వానిది దోచుకో.. దాచుకో పథకం
- మంచిర్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**మంచిర్యాల, రాజముద్ర న్యూస్** : క్యాతనపల్లి మున్సిపాలిటీ కావాలని మంత్రి వివేక్ అడిగితే నవ్వుకుంటూ ఇచ్చేవాళ్లమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ అధ్యక్షతన ఆదివారం నస్పూర్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం, క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గ సన్మాన కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్యాతనపల్లి ఎన్నికల్లో మంత్రి నీచ రాజకీయాలకు పాల్పడ్డారని, కుట్రలు చేసి అక్రమ కేసులు పెట్టించి సబ్‌జైలుకు కాకుండా ఆదిలాబాద్ జైలుకు పంపించి ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. 22 వార్డులు ఉన్న క్యాతనపల్లిలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి 14 స్థానాల్లో గెలిచినప్పటికీ కాంగ్రెస్ కౌన్సిలర్‌ను చైర్మన్‌గా చేయడానికి ప్రలోభాలకు దిగారని ఆరోపించారు. కోట్ల రూపాయలు, బ్లాంక్ చెక్కులు ఇచ్చి ఆకర్షించే ప్రయత్నాలు చేసినా బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు నిజాయితీగా నిలిచారని అభినందించారు. బాల్కసుమన్‌పై అక్రమ కేసులు పెట్టి ఆదిలాబాద్ జైలులో ఉంచారని, కౌన్సిలర్ భూమగౌడ్‌ను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వకుంటే ఇల్లు కూల్చేస్తామని బెదిరించారని విమర్శించారు. వెయ్యి మంది పోలీసులను మోహరించి ప్రజల్లో భయాందోళనలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో మహిళా కౌన్సిలర్లపై కాంగ్రెస్ సభ్యులు అసభ్యంగా ప్రవర్తించినా మంత్రి వివేక్, ఎంపీ వంశీ స్పందించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక రాజకీయాలు నడుస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 'దోచుకో– దాచుకో' విధానంతో పాలన సాగిస్తున్నదని విమర్శించారు.

### సర్కారు విఫలం

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. హామీలు ఇచ్చి అమలు చేయలేకపోయారని, కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేసే వారు గతంతో పోలిస్తే సాగు, దిగుబడులను పరిశీలించాలని సూచించారు. ధాన్యం దిగుబడి 24 లక్షల టన్నుల నుంచి కోటిన్నర లక్షల టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా అమలు చేసి రైతులకు అండగా నిలిచామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం జరుగు తోందని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

### సింగరేణిపై విమర్శలు

సింగరేణి సంస్థ నిర్వహణలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ సీఎం కుటుంబ సభ్యులపై విమర్శలు గుప్పించారు. కాంట్రాక్టుల విషయంలో బెదిరింపులకు పాల్పడుతున్నారని, వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 16 వేల మందికి మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగాలు కల్పించిందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు తమ సమస్యలపై ఎమ్మెల్యేలను నిలదీయాలని, వారికి బీఆర్ఎస్, టీబీజీకేఎస్ అండగా ఉంటాయని తెలిపారు. మెడికల్ బోర్డు, ఇండ్ల పట్టాలు తదితర సమస్యలపై త్వరలో పోరాటం చేపడతామని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న సింగరేణి, సహకార, పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. క్యాతనపల్లిలో చూపిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించాలని సూచించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపాలిటీలో గెలిచిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, కోరుకంటి చందర్, కోనూరు కోనప్ప, టీబీజీకేఎస్ నాయకులు రాజిరెడ్డి, మూల రాజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సంధ్యారాణి, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ మళ్లీ టీఆర్ఎస్‌గా..!

చంద్రుడిపై మబ్బులు కమ్ముకున్నా అవి తొలగి మళ్లీ ప్రకాశిస్తాడని కేటీఆర్ పేర్కొన్నారు. ఈసారి కూడా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. పొత్తులతో తమకు ప్రయోజనం లేదని, గతంలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలు 179కు, పార్లమెంట్ స్థానాలు 28కు పెరుగుతాయని తెలిపారు. రాజకీయాల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని, చరిత్రలో నిలిచిపోయే సీఎంలుగా ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్ ఉన్నారని వ్యాఖ్యానించారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

- మంత్రి పొన్నం ప్రభాకర్



**చిగురుమామిడి, రాజముద్ర న్యూస్** : రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారిస్తే అధిక లాభాలు సాధించవచ్చని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ పంట లాభదాయకమని, తాను గ్యారంటీ ఇస్తానని స్పష్టం చేశారు. ఆదివారం చిగురుమామిడి రైతు వేదికలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 24 మంది రైతులకు రూ.40.80 లక్షల విలువైన పనిముట్లు, యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటావేటర్లు, బేలర్లు, పవర్ స్ప్రేయర్లు అందజేశారు. ప్రతి చిన్న గ్రామంలో 50 ఎకరాలు, పెద్ద గ్రామాల్లో 100 ఎకరాల వరకు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని సూచించారు. అంతర పంటలు కూడా సాగు చేయవచ్చని తెలిపారు. అధికంగా సాగు చేసే గ్రామాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే అదనపు పరికరాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల పనులు త్వరలో పూర్తి చేస్తామని, భూములు ఇవ్వాలని రైతులను కోరారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు స్థల పరిశీలన

చిగురుమామిడిలో 4 ఎకరాల్లో 1 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం మంత్రి స్థలాన్ని పరిశీలించారు. ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, ఆర్డీవో మహేశ్వర్, సర్పంచ్ ఆకవరం భవాని, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో విజయకుమార్, సర్పంచులు, ఉపసర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## ఔదార్యాన్ని చాటుకున్న మంత్రి తుమ్మల



**ఖమ్మం, రాజముద్ర న్యూస్** : ఖమ్మం మంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల దగ్గరకి స్వయంగా వెళ్లిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి, సత్వరమే పరిష్కారం చేపిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. సందర్భంగా వారు మంత్రి తుమ్మలకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టా పంపిణీ



**కూసుమంచి, రాజముద్ర న్యూస్** : కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ స్వంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడంలో తమ బృందం ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కణతాల నాగయ్య, కలకొండ పున్నయ్య, శేఖర్ రెడ్డి, కణతాల వీరన్న, జిల్లపల్లి ఉప్పయ్య పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



**వేములపల్లి, రాజముద్ర న్యూస్** : ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ, నాయకులు అండగా ఉంటారని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగవల్లి శంకర్ తల్లి అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే దైద జాన్సన్, పుట్టల కిషోర్, వల్లపు దాసు కిరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం శెట్టిపాలెం గ్రామానికి చెందిన మజ్జిగపు వెంకట్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇక మచ్చ లచ్చయ్య మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పుట్టల సందీప్, సైదులు, టీఆర్ఎస్ నాయకుడు కట్ట మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట



**యాదగిరిగుట్ట, రాజముద్ర న్యూస్** : ఆదివారం సెలవు కావడంతో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు యాదగిరి కొండ భక్తులతో కిటకిటలాడింది. 'ఓం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామియే నమః' నామస్మరణతో భక్తులు కొండపైకి తరలి వెళ్లారు. పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ధర్మదర్శనానికి సుమారు మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. స్వామివారి ఆలయంలో నిత్య పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి తులసీదళాలు సమర్పించారు. ప్రాకార మండపంలో సుదర్శన నరసింహ హోమం, నిత్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు కళ్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వెండి జోడు సేవలో స్వామివారిని అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కూడా నిత్య పూజలు నిర్వహించారు.



# క్రీడల్లో పట్టుదల ఉంటే పతకాల పంటే..

**జాతీయ టార్గెట్ బాల్ ఛాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్!**

**ఉత్తరప్రదేశ్‌పై ఘనవిజయం..**

**ఫెడరేషన్ కప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఏపీ జట్టు**

స్పోర్ట్స్ డెస్క్, రాజమండ్రి

క్రీడా... ...తీసి.. వారి క్రమశిక్షణతో పాటు శిక్షణ ఇచ్చి తగిన మెళుకువలు నేర్పిన క్రీడా ప్రోత్సాహకులు, కోచ్‌లు, ఎంతటి విజయమైనా సాధించగలరని జాతీయ బాలబాలికల టార్గెట్ బాల్ లో క్రీడాకారులు చూపిన ప్రతిభ రుజువు చేసిందని ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్‌బాల్ క్రీడాకారులను ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్ బాల్ అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఈనెల 4 వ తేదీ నుంచి 7 తేదీ వరకు మనోజ్ సర్కార్ స్పోర్ట్స్ స్టేడియం, రుద్రపూర్, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన 13వ సీనియర్ నేషనల్ బాల బాలికల టార్గెట్ బాల్ ఛాంపియన్షిప్ , 5వ సీనియర్ బాలుర టార్గెట్ బాల్ ఫెడరేషన్ కప్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ జట్టు సీనియర్ జాతీయ స్థాయిలో ఉత్తరప్రదేశ్ జట్టు పై 23-10 స్కోర్ తో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది .అలాగే ఫెడరేషన్ కప్ ఫైనల్‌లో ఉత్తరప్రదేశ్ జట్టు పై వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడం తో 10-9 స్కోర్ తో రన్నర్ అప్ గా నిలిచింది. కోచ్ వాసుపల్లి గురుమూర్తి పూసపాటి సత్యనారాయణ రాజు, కెప్టెన్ జి సందీప్ (దీపు)ల కృషితో ఆంధ్ర ప్రదేశ్ జట్టు తమ సత్తా చాటింది. ఈ పోటీలలో క్రీడాకారుడు భాస్కర్ అద్భుత ప్రదర్శనకు ఉత్తమ ప్లేయర్ అవార్డు, జి.సందీప్ (దీపు), ఉత్తమ డైమండ్ (గోల్ కీపర్) ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్బాల్ క్రీడాకారులను ఆంధ్ర ప్రదేశ్ టార్గెట్ బాల్ అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు, కార్యదర్శి ఎం.సురేష్ కుమార్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌కు స్వర్ణం





**ప్యూబ్లా(మెక్సికో):** ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో భారత్ పసిడి పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం వెన్నెం జ్యోతిసురేఖ, మధుర, ప్రగతి 233-232తో అమెరికాపై ఉత్కంఠ విజయాన్ని సాధించింది. తొలి రౌండ్ నుంచే భారత్, అమెరికా ఢీ అంటే ఢీ అన్నట్లు పోటీపడ్డాయి. తొలి రౌండ్‌లో భారత్ 59-58తో అమెరికాపై స్వల్ప ఆధిక్యం ప్రదర్శించగా, రెండో రౌండ్‌లో ఆధిక్యం 114-117 తగ్గింది. అయితే మూడో రౌండ్ ముగిసే సరికి 173-174తో స్వల్ప వెనుకంజలో ఉన్న భారత్ చివర్లో ఆరు పది పాయింట్లు ఖాతాలో వేసుకోవడంతో పసిడి ఖాతాలో చేరింది.

# వాంఖడేలో పరుగుల వరద.. ఆర్సీబీదే విజయం!

**ముంబై ఇండియన్స్‌పై 18 పరుగుల తేడాతో గెలుపు**

**చెలరేగిన బ్యాటర్లు.. ఫిల్ సాల్ట్ (78), పాటిదార్ (53), కోహ్లీ (50) హాఫ్ సెంచరీలు**





ముంబై, ఏప్రిల్ 12: ఐపీఎల్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ఆదివారం పరుగుల వరద పారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర పోరులో విజయం ఆర్సీబీనే వరించింది. బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ మ్యాచ్‌లో ముంబైపై 18 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ సైతం దీటుగా బదులిచ్చినప్పటికీ, 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 222 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది.

## ఆర్సీబీ బ్యాటింగ్ విధ్వంసం


టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ బ్యాటర్లు ఆది నుంచే ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఓపెనర్ ఫిల్ సాల్ట్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 36 బంతుల్లోనే 78 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 38 బంతుల్లో 50 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు మూలస్తంభంలా నిలిచాడు. వీరిద్దరూ అద్భుతమైన పునాది వేయడంతో, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రజత్ పాటిదార్ సైతం ఏమాత్రం తగ్గలేదు. బౌలర్ ఎవరన్నది చూడకుండా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడి కేవలం 20 బంతుల్లోనే 53 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. దీంతో ఆర్సీబీ 240 పరుగుల భారీ స్కోరును నమోదు చేయగలిగింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (1/32), హార్దిక్ పాండ్యా (1/39), మిచెల్ సాంట్నర్ (1/43) తలో వికెట్ తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

## పోరాడి ఓడిన ముంబై

241 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. భారీ లక్ష్య ఛేదనలో కావాల్సిన రన్ రేట్‌ను అందుకునేందుకు తీవ్రంగా శ్రమించింది. మిడిలార్డర్‌లో షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 31 బంతుల్లోనే అజేయంగా 71 పరుగులు చేసి ముంబై శిబిరంలో ఆశలు రేకెత్తించాడు. అతనికి తోడుగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా 22 బంతుల్లో 40 పరుగులు, ర్యాన్ రికెల్టన్ 22 బంతుల్లో 37 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేశారు. ఒక దశలో ముంబై బ్యాటర్ల దాటికి మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారినప్పటికీ.. ఆర్సీబీ బౌలర్లు కీలక సమయాల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ముంబై బ్యాటర్లను నిలువరించారు. ముఖ్యంగా సుయాశ్ శర్మ 4 ఓవర్లలో 47 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. రసిఖ్ సలామ్ (1/23), కృనాల్ పాండ్యా (1/26) తలో వికెట్ పడగొట్టి ముంబైని కట్టడి చేయడంలో సఫలమయ్యారు. చివరికి ముంబై 222 పరుగుల వద్దే ఆగిపోవడంతో ఆర్సీబీ ఖాతాలో అద్భుత విజయం చేరింది.







# టైటాన్స్ పంజా.. లక్నో చిత్తు!

**ఎకానా స్టేడియంలో లక్నోపై 7 వికెట్ల తేడాతో గుజరాత్ ఘన విజయం**

**లక్నో, ఏప్రిల్ 12:** ఐపీఎల్ టోర్నీలో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అర్ధోనమౌలోని ఎకానా క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్ వేదికగా ఆదివారం జరిగిన ఆసక్తికర పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో గుజరాత్ సత్తా చాటింది. బౌలింగ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ నాలుగు వికెట్లతో లక్నోను కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్ అర్ధ సెంచరీలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేయగా.. అనంతరం బరిలోకి దిగిన గుజరాత్ కేవలం 18.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 165 పరుగులు సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది.

## కట్టడి చేసిన గుజరాత్ బౌలర్లు

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లను గుజరాత్ బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్‌తో కట్టడి చేశారు. ఏ దశలోనూ లక్నో బ్యాటర్లు స్వేచ్ఛగా పరుగులు చేయలేకపోయారు. ఎయిడెన్ మార్క్రమ్ 21 బంతుల్లో 30 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నికోలస్ పూరన్ 21 బంతుల్లో 19 పరుగులు, రిషభ్ పంత్ 11 బంతుల్లో 18 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచారు. మిగతా బ్యాటర్లు కూడా భారీ స్కోర్లు చేయడంలో విఫలమవడంతో లక్నో 164 పరుగులకే పరిమితమైంది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి లక్నో పతనాన్ని శాసించాడు. అశోక్ శర్మ 32 పరుగులిచ్చి 2 వికెట్లు, మొహమ్మద్ సిరాజ్ కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసి అతనికి అద్భుతమైన సహకారం అందించారు.



## ఆడుకున్న బట్లర్, గిల్

165 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్ అదిరిపోయే శుభారంభాన్ని అందించారు. లక్నో బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. బట్లర్ 37 బంతుల్లోనే 60 పరుగులు చేసి పెవిలియన్ చేరగా.. గిల్ 40 బంతుల్లో 56 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ కేవలం 13 బంతుల్లోనే అజేయంగా 21 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ లక్ష్యాన్ని చేరుకుంది.

## తేలిపోయిన లక్నో బౌలింగ్

మోస్తరు లక్ష్యాన్ని కాపాడుకోవడంలో లక్నో బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. దిగ్వేశ్ రాఠీ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి ఒక వికెట్, ప్రిన్స్ యాదవ్ 31 పరుగులిచ్చి ఒక వికెట్, మొహమ్మద్ షమీ 36 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీయలేకపోవడం, బట్లర్, గిల్ జోడీని విడదీయడంలో విఫలమవడం లక్నో ఓటమికి ప్రధాన కారణమైంది. అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో గుజరాత్ విజయానికి బాటలు వేసిన ప్రసిద్ధ్ కృష్ణకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



# వాటికే పరిమితం కాను:

## ప్రియాంక అరుళ్ మోహన్

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ప్రియాంక అరుళ్ మోహన్, విభిన్న పాత్రలే తన లక్ష్యమని తెలిపారు. 'గ్యాంగ్ లీడర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇటీవల 'మేడ్ ఇన్ కోరియా' చిత్రంతో మరోసారి మంచి స్పందన పొందారు. బయో టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సినిమాలపై ఆసక్తితో నటిగా మారానని ప్రియాంక తెలిపారు. 'ఒంధ్ కథే హెళ్లా' అనే కన్నడ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నాని, శర్వానంద్ వంటి హీరోలతో కలిసి పనిచేయడం ద్వారా ఎంతో నేర్చుకున్నానని, పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ' (గా+) చిత్రంలో నటించడం మరచిపోలేని అనుభవంగా నిలిచిందన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, సవాలు చేసే విభిన్న పాత్రల్లో నటించడానికే తాను ఆసక్తి చూపుతానని ప్రియాంక అరుళ్ మోహన్ స్పష్టం చేశారు.



# యోధుడి లుక్‌లో అరవింద్ కృష్ణ..

## 'కర్మస్థలం'పై పెరుగుతున్న అంచనాలు

రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. ఈ చిత్రాన్ని రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా, సంగీతాన్ని సాయి కార్తిక్ అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు ప్రేక్షకులను ఆకర్షించగా, తాజాగా అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన కొత్త లుక్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం సూపర్ హీరో తరహా పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న అరవింద్ కృష్ణ, ఈ చిత్రంలో యోధుడి రూపంలో కనిపించబోతున్నారు. విడుదలైన లుక్‌లో ఆయన పాత్ర శక్తివంతంగా కనిపిస్తుండగా, విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం భావిస్తోంది. ఈ చిత్రంలో అరవింద్ కృష్ణతో పాటు చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి, కాలకేయ ప్రభాకర్, వెంకటేష్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేష్, నాగ మహేష్, వినోద్ అల్వా, మిథాలీ చౌహన్, కిల్లి క్రాంతి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు



# బేబమ్మకు వరుస ఫ్లాపులు

## 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో మరోసారి నిరాశ

'ఉప్పెన' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన నటి కృతి శెట్టి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సాధించింది. ఆ తరువాత 'శ్యామ్ సింగ రాయ్', 'బంగార్రాజు' చిత్రాలతో వరుస విజయాలు అందుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. అయితే అనంతరం ఆమె నటించిన పలు చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో కెరీర్‌లో వరుస నిరాశలు ఎదురవుతున్నాయి. తాజాగా విడుదలైన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం కూడా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తమిళంలో వీకెండ్ రోజుల్లో కొంత వసూళ్లు వచ్చినప్పటికీ, తెలుగులో స్పందన పరిమితంగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2040 నేపథ్యంలో తెరకెక్కిన ఈ ప్రేమకథలో కథ, కథనం ఆశించిన స్థాయిలో లేకపోవడం నెగటివ్ స్పందనకు కారణమవుతోందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో కృతి శెట్టికి నటనకు కొంత అవకాశమున్నప్పటికీ, తన ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే స్థలం దక్కలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే ఏడాది విడుదలైన కార్తీతో చేసిన చిత్రం కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం కృతి శెట్టి నటించిన 'జీనీ' చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తోంది. జయం రవి హీరోగా రూపొందిన ఈ ఫాంటసీ డ్రామా వివిధ కారణాలతో ఆలస్యం అవుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖ హీరోలతో నటించినప్పటికీ, మరో భారీ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా అన్నది సినీ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# తెలుగింటి కోడలు కాబోతున్నదా?

## హాట్ టాపిక్ గా అల్లు అరవింద్ వ్యాఖ్యలు

స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చేసిన సరదా వ్యాఖ్యలు ఈ అంశాన్ని హాట్ టాపిక్‌గా మార్చాయి. మృణాల్ ఠాకూర్ ప్రతిభపై స్పందించిన అల్లు అరవింద్, తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించుకుందని తెలిపారు. 'సీతారామం' చిత్రంతో తన నటన ప్రతిభను నిరూపించుకుని తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఒక హీరోయిన్‌ను మనస్ఫూర్తిగా దీవించానని, అనంతరం ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకుని తమ ఇంటి కోడలిగా మారిందని తెలిపారు. అదే విధంగా మృణాల్ ఠాకూర్‌ను కూడా దీవిస్తున్నానని, తెలుగు సినిమాలు చేస్తూ ఇక్కడే ఒక మంచి వ్యక్తిని చూసుకుని పెళ్లి చేసుకుని తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నట్లు సరదాగా వ్యాఖ్యానించారు. అల్లు అరవింద్ చేసిన ఈ వ్యాఖ్యలతో మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల్లో కూడా ఈ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చలకు దారితీస్తున్నాయి.





Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com